
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం। 29। ఏప్రిల్। 2025



చీనీ టన్ను రూ.23,100
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.23,100, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



డిగ్రీ పరీక్ష తేదీ మార్పు
ఎస్కేయూ పరిధిలో మే 7వ తేదీన నిర్వహించాల్సిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు జూన్ 4న నిర్వహించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ మార్పు చేశారు.



గరిష్టం/కనిష్టం
38.9°/21.2°
జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

క్వింటా చింతపండు రూ.19 వేలు



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: క్వింటా చింతపండు గరిష్టంగా రూ.19 వేలు పలికింది. సోమవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 450.60 క్వింటాళ్ల చింతపండు రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలంపాట నిర్వహించారు. ఇందులో కరిపుళి రకం చింతపండు గరిష్టంగా రూ.19 వేలు, కనిష్టంగా రూ. 8,100, సరాసరిన రూ.14 వేల ప్రకారం ధర పలికింది. ఇక ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ. 12 వేలు, కనిష్టంగా రూ.4,200, సరాసరిన రూ. 8 వేల ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు.

15న ‘మడకశిర’లో బలపరీక్ష

- చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం
- కౌన్సిలర్లు అందరూ హాజరుకావాలని నోటీసులు

మడకశిర: స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమైంది. అవిశ్వాస తీర్మానానికి అవకాశం ఇవ్వాలని ఇప్పటికే 13 మంది కౌన్సిలర్లు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో మే నెల 15వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు కలెక్టర్ అనుమతి ఇచ్చారు. అదేరోజు మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టనున్నారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లందరూ హాజరు కావాలని సోమవారం అధికారులు నోటీసులు జారీ చేశారు. మడకశిర మున్సిపాలిటీలో 20 వార్డులుండగా... గత ‘స్థానిక’ ఎన్నికల్లో 15 స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. టీడీపీ ఐదు స్థానాలతో సరిపెట్టుకుంది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక మున్సిపల్ పీఠంపై కన్నేసిన టీడీపీ నాయకులు 8 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను భయపెట్టి, ప్రలోభాలకు గురిచేసి టీడీపీలో చేర్చుకున్నారు. అనంతరం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సర్వం సిద్ధం చేశారు.

19 మండలాల్లో వాన



పరిగి: కొడిగెనహళ్లి అంధుల ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో వర్షంతో విరిగిపడిన కొమ్మలు

పుట్టపర్తి అర్బన్: వాతావరణంలో ఒక్కసారి మార్పులు చోటుచేసుకోగా, ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ జిల్లాలోని 19 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా మడకశిరలో 39.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇక సీకేపల్లి 17.2, ధర్మవరం 16.4, గుడిబండ 16.2, అగళి 11.4, కనగానపల్లి 10.2, బత్తలపల్లి 9.2, రొళ్ల 7.2, పరిగి 4.2, అమరాపురం 2.6, కదిరి 2.2, రామగిరి 2.2, నల్లచెరువు 2.0, హిందూపురం 1.8, గాండ్లపెంట 1.6, తాడిమర్రి 1.2, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాల్లో ఒక సెంటీమీటరు చొప్పున, కొత్తచెరువు మండలంలో 0.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. రాగల నాలుగు రోజులూ ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు, జీవాల కాపర్లు, కూలీలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

భారీ వర్షంతో నేలకొరిగిన చెట్లు

పరిగి: మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మోదా, శ్రీరంగరాజుపల్లి, కొడిగెనహళ్లి, పరిగి, తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొడిగెనహళ్లిలో అంధుల ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో పలు చెట్లు నేలకొరిగాయి. చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లపై పడటంతో సేవా మందిరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో అన్ని గ్రామాల్లో అంధకారం నెలకొంది.

సబ్సిడీతో డ్రిప్పు, స్ప్రింక్లర్లు

పుట్టపర్తి అర్బన్: అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం సబ్సిడీ డ్రిప్పు, స్ప్రింక్లర్ల (2025–26 సంవత్సరానికి) అందిస్తోందని ఏపీ ఎంఐపీ పీడీ సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. బోరు బావి ఉన్న రైతులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. డ్రిప్పును సంబంధించి 5 ఎకరాల వరకూ 90 శాతం, 10 ఎకరాల వరకూ 70 శాతం, స్ప్రింక్లర్లకు సంబంధించి 5 ఎకరాల వరకూ 55 శాతం, 5 నుంచి 12.5 ఎకరాల వరకూ 45 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు.



జిల్లాలో గంజాయి గుప్పుమంటోంది. పల్లెపల్లెకూ చేరి యువతను గమ్మత్తులో ముంచుతోంది. సోషల్ మీడియా ద్వారా కోడ్‌భాషలతో మత్తు దందా జరుగుతోంది. సిగరెట్, చాక్లెట్‌ల ద్వారా జేబుల్లోకి చేరి ఆరోగ్యాలను గుల్ల చేస్తోంది. మత్తుకు బానిసలైన యువత పెడదారి పడుతోంది.

గంజాయి గుప్పు!

- చీకటి పడితే చాలు హిందూపురంలోని పరిగి బస్టాండు సమీపంలో యువత గుమిగూడతారు. గంజాయ్‌తో కూడిన సిగరెట్లు కాలుస్తూ ఎంజాయ్ చేస్తుంటారు.
- ధర్మవరంలో రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా యువత గుంపులుగా కనిపిస్తారు. పిచ్చాపాటిగా మాట్లాడుకుంటూ సిగరెట్‌తో పాటు గంజాయి పీలుస్తూ మత్తును ఆస్వాదిస్తున్నారు.
- పెనుకొండలో జాతీయ రహదారి సమీపంలో జండూ బామ్ డబ్బాలలో.. చాక్లెట్ల రూపంలో స్థానికేతరులు గంజాయిని ఎంజాయ్ చేస్తున్నారు.
- పుట్టపర్తిలోని చిత్రావతి నది పరీవాహక ప్రాంతంలో చీకటిపడితే దమ్మారో.. దమ్ అనే రీతిలో యువత గుట్టు చప్పుడు కాకుండా గంజాయి పీలుస్తోంది.

..ఇలా జిల్లాలోని ప్రతి ప్రాంతంలోనూ గంజాయి గుప్పుమంటోంది. మత్తుకు బానిసైన యువత ఆ మైకంలో నేరాలకు పాల్పడుతున్నారు.

- జిల్లాలో గుట్టు చప్పుడు కాకుండా విక్రయాలు
- రాత్రికి రాత్రే రైళ్లలో పలు ప్రాంతాలకు సరఫరా
- పెన్నులు, చాక్లెట్ పేపర్లలో చుట్టి యువతకు అందజేత
- మత్తులో అఘాయిత్యాలకు పాల్పడుతున్న పోకిరీలు
- పుట్టపర్తి, పెనుకొండ, హిందూపురంలో అధికం



ఈ నెల 3న ఐదుగురు గంజాయి విక్రేతలను అరెస్టు చూపుతున్న హిందూపురం పోలీసులు

సాక్షి, పుట్టపర్తి: జిల్లాలో మత్తు కొత్త రూపం సంతరించుకుంది. హిందూపురం, ధర్మవరం, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్నాయి. చిన్న పరిమాణంలో ప్లాస్టిక్ డబ్బాలలో నింపి అమ్ముతున్నట్లు తెలిసింది. ఆ డబ్బాలను యువత రహస్యంగా కొనుగోలు చేసి రోజూ సాయంత్రం తెగ పీల్చుతున్నారు. కొత్త మత్తును ఎంజాయ్ చేస్తూ జీవితాలు పాడు చేసుకుంటున్నారు. చీకటి పడితే చాలు శివారు ప్రాంతాలకు బృందాలుగా వెళ్లి డబ్బాల్లోని గంజాయిని ఖాళీ చేస్తున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు గంజాయి విక్రయదారులపై పోలీసుల పర్యవేక్షణ కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

రూ.3 వేలకు కొని రూ.7 వేలకు విక్రయం..

ఇతర ప్రాంతాల్లో కిలో గంజాయి రూ.3 వేలకు కొని.. ఇక్కడ ప్యాకెట్లుగా తయారు చేసి కిలో రూ.7 వేల వరకు కొందరు విక్రయాలు చేస్తున్నట్లు తెలిసింది. కర్ణాటక నుంచి పెనుకొండకు చేరి.. అక్కడి నుంచి హిందూపురం, ధర్మవరం, పుట్టపర్తి తదితర ప్రాంతాలకు గంజాయి సరఫరా అవుతున్నట్లు సమాచారం.

రోజంతా మత్తులోనే..

పిన్నీసు కొనను గంజాయి ఆయిల్ డబ్బాలో ముంచి తీసి సిగరెట్‌కు అంటిస్తే చాలు.. ఘాటైన పొగ మత్తు క్షణాల్లో వస్తోంది. ఓసారి వచ్చిన మత్తు 24 గంటల వరకు వదలదు. ఇలా ద్రవరూపంలోని గంజాయి జిల్లాలోని పలు ప్రాంతాల్లో యువత జీవితాలను బలి చేస్తోంది. అదేవిధంగా చాక్లెట్ల రూపంలో కూడా గంజాయి అమ్ముతున్నట్లు తెలిసింది. వందల సంఖ్యలో యువకులు.. ముఖ్యంగా ఇంజినీరింగ్ చదివేవాళ్లు కొత్త మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

కియా కార్ల కంపెనీలో పనిచేసేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కార్మికులు వచ్చారు. వారిలో చాలా మంది గంజాయి మత్తుకు బానిసలు. దీంతో వారు ఇతర ప్రాంతాల నుంచి సరుకు తెప్పించుకుని వారు తాగడంతో పాటు డబ్బుపై ఆశతో విక్రయాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో హిందూపురం, ధర్మవరం తదితర ప్రాంతాల్లో పాన్ షాపుల్లో చిన్న చిన్న పొట్లాల్లో ఘనరూపంలో గంజాయి విక్రయాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో గంజాయి రవాణా, విక్రయాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. అడపాదడపా కేసులు నమోదు చేసినా అరికట్టలేకపోతున్నారు.

గుట్టు చప్పుడు కాకుండా..

గంజాయి పొరుగు రాష్ట్రాల నుంచి ముదిగుబ్బ, హిందూపురం, పెనుకొండ రైల్వే స్టేషన్‌లకు గుట్టు చప్పుడు కాకుండా చేరుతోంది. అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు రాత్రి వేళల్లో మహిళలు, చిన్నారుల ద్వారా అక్రమంగా సరఫరా అవుతోంది. ఎవరికీ అనుమానం రాకుండా బీడీలు, సిగరెట్లు, చాక్లెట్ల రూపంలోకి మార్చి అమ్మకాలు చేస్తున్నారు. మత్తుకు అలవాటు పడిన వారు ఏ ప్రాంతాల్లో ఉన్నారు. గంజాయి కొనేందుకు ఎక్కడికి వస్తారు? సరుకు ఎవరికి ఎంత ఇవ్వాలి? తదితర విషయాలన్నీ గోప్యంగా జరుగుతాయి.

మత్తులో అఘాయిత్యాలు..

గతేడాది దసరా పండుగ ముందురోజు రాత్రి చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి గ్రామ సమీపంలోని ఓ పేపర్‌మిల్ వద్ద అత్తా కోడళ్ల గ్యాంగ్‌రేప్‌లో పాల్గొన్న నిందితులంతా గంజాయి మత్తులోనే దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు తేల్చారు. ఈ కేసులో ఆరుగురిని అదుపులోకి తీసుకోగా.. ముగ్గురు మైనర్లు ఉన్నారు. వారందరూ హిందూపురం పట్టణానికి చెందిన వారే. వారంతా స్థానికంగా గంజాయి బ్యాచ్‌గా పేరుపొందిన వారుగా సమాచారం.

కఠిన చర్యలు తీసుకుంటాం



గంజాయి ఏ రూపంలో పట్టుబడినా నేరమే. రవాణా చేసేవారు, విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవు. యువతపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉండాలి. పిల్లలు పెడదోవ పట్టకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. గంజాయి కట్టడి కోసం టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. ఎవరైనా గంజాయి సాగు చేస్తుంటే సమాచారం ఇవ్వొచ్చు. నిషేధిత గంజాయిపై సమాచారం ఇస్తే తప్పక చర్యలు తీసుకుంటాం.
– వి.రత్న, ఎస్పీ

‘తమ్ముళ్ల’ తన్నులాట!

- రచ్చకెక్కిన భూ తగాదాలు
- సాలక్కగారి శ్రీనివాసులు రుబాబు
- మైలసముద్రం సుబ్రమణ్యంపై దాడి
- కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



కొత్తచెరువు: పుట్టపర్తి నియోజకవర్గంలో ‘తెలుగు తమ్ముళ్లు’ భూ తగాదా పోరు రచ్చకెక్కింది. రెండు రోజుల క్రితం కొత్తచెరువులో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఓ భూ తగాదాలో రౌడీషీటర్, టీడీపీ నాయకుడు సాలక్క గారి శ్రీనివాసులు తన అనుచరులతో కలిసి మైలసముద్రం సుబ్రహ్మణ్యంపై దాడి చేశాడు. బాధితుడు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏం జరిగిందంటే...

కొత్తచెరువు నుంచి పెనుకొండకు వెళ్లే మార్గంలో తిప్పాబట్లపల్లి రెవెన్యూ పొలం సర్వే నంబరు 71–1లో మూడెకరాల పొలం ఉంది. ఆ పొలంపై బ్రాహ్మణులకు ఎలాంటి హక్కులు లేవు. కానీ బ్రాహ్మణుల నుంచి ఆ భూమి కొన్నట్లు సాలక్కగారి శ్రీనివాసులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అమ్మకానికి పెట్టాడు. భూమి కొనేందుకు సిద్ధమైన వ్యక్తి టీడీపీ నాయకుడు మైలసముద్రం సుబ్రహ్మణ్యంకు స్నేహితుడు కావడంతో భూమి కొనుగోలు విషయం చర్చకు రాగా.. అసలు విషయం బయటపడింది. ఈ క్రమంలో భూమి కొనదలచిన వ్యక్తి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. దీనంతటికీ మైలసముద్రం సుబ్రహ్మణ్యమే కారణమని భావించిన సాలక్కగారి శ్రీనివాసులు ఆగ్రహంతో ఊగిపోయాడు. శనివారం రాత్రి నాలుగు రోడ్ల కూడలిలోని అన్నపూర్ణ హోటల్‌లో ఉన్న సుబ్రహ్మణ్యం వద్దకు వెళ్లి గొడవకు దిగాడు. తన భూమిని విక్రయించకుండా అడ్డుకుంటావా... అంటూ అంటూ సాలక్కగారి శ్రీనివాసులు, అతడి అనుచరులు దాడి చేశారు. దాడిలో గాయపడిన సుబ్రమణ్యం కొత్తచెరువు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

తెలంగాణ సీఎస్‌గా ఏపీఆర్‌ఎస్ పూర్వ విద్యార్థి



కె.రామకృష్ణారావు

పరిగి: తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా ఏపీఆర్‌ఎస్ కొడిగెనహళ్లి పూర్వ విద్యార్థి కె.రామకృష్ణారావు నియమితులయ్యారు. ఉమ్మడి అనంతపురం జిల్లా గుత్తికి చెందిన రామకృష్ణారావు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకూ గుత్తి కోటలోని 8వ వార్డు స్కూల్లో చదువుకున్నారు. అనంతరం కొడగినహళ్లి ఏపీఆర్‌ఎస్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం సాగించారు. అనంతరం నాగార్జున సాగర్‌లో ఇంటర్, కాన్పూర్ ఐఐటీలో బీటెక్, ఢిల్లీ ఐఐటీలో ఎంటెక్, డ్యూక్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ పూర్తి చేశారు. 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావు అంచెలంచెలుగా ఎదిగారు. తెలంగాణ (హైదరాబాద్)లో సెటిల్ అయ్యారు. తెలంగాణ ఆర్థిక కార్యదర్శిగా కూడా పని చేశాడు. రామకృష్ణారావు తెలంగాణ సీఎస్‌గా ఎంపిక కావడంతో ఏపీఆర్‌ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ మురళీధర్ బాబు, ఉపాధ్యాయ బృందం, పూర్వవిద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. తమ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి చీఫ్ సెక్రటరీ హోదాలో ఉండటం తమకెంతో గర్వకారణమన్నారు.

రెడ్డప్పశెట్టి ‘పాలీహౌస్ సబ్సిడీ’పై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

చిలమత్తూరు: రియల్టర్ రెడ్డెప్పశెట్టి పాలీహౌస్‌ల పేరుతో అక్రమంగా రూ.కోట్లు లబ్ధిపొందడంపై ‘సాక్షి’లో సోమవారం ప్రచురితమైన ‘‘అక్రమాలు కోకొల్లలు’’ కథనంపై ఉద్యాన శాఖ అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉద్యానశాఖ అధికారి మహేష్ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించారు. ఆయా సంవత్సరాల్లో సబ్సిడీ పొందిన వారి వివరాలను పరిశీలిస్తున్నారు. రెడ్డెప్పశెట్టి ఎస్టేట్‌ను కూడా అధికారులు పరిశీలించి వెళ్లినట్టుగా తెలుస్తోంది. ఇక సబ్సిడీ ముసుగులో రెడ్డెప్పశెట్టి, ఆయన బృందం చేసిన ప్రజాధనం లూటీపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఆయన అక్రమాలపైనే జోరుగా చర్చ జరిగింది. వామ్మో రూ.5.48 కోట్లు అవినీతి జరిగిందా..? అనే మాటలు సర్వత్రా వినపడ్డాయి. ఈ తరహా మోసాలు చూడటం ఇదే తొలిసారని చెబుతున్నారు. ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా చర్చ సాగింది. ప్రజాధనం లూటీపై విచారణ జరపాలని నియోజకవర్గ ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మహిళల నిరసనాగ్రహం

- తాగునీటి కోసం ఖాళీ బిందెలతో బైఠాయింపు



ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న చలమయ్యగారిపల్లి గ్రామస్తులు

గోరంట్ల: తాగునీటి కోసం మండలంలోని కొండాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని చలమయ్యగారిపల్లి గ్రామస్తులు నిరసనకు దిగారు. ఖాళీ బిందెలతో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించారు. గ్రామానికి చెందిన కొందరు నీరు సరఫరా చేసే పైప్‌లైన్‌కు మోటార్లు బిగించి నీరు సంపులకు సరఫరా చేసుకుంటున్నారని, తద్వారా వీధి కుళాయిలకు నీరు రావడం లేదని, ఈ విషయాన్ని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. రెండేళ్లుగా తాము తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకూ కదిలేది లేదన్నారు. స్పందించిన ఎంపీడీఓ నాగేంద్ర వారితో చర్చించారు. చలమయ్యగారిపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రక్షిత మంచినీటి శాఖ ఇంజనీర్ మోహన్‌ను ఆదేశించారు. దీంతో గ్రామస్తులు శాంతించి అక్కడినుండి వెనుదిరిగారు. కార్యక్రమంలో కొండాపురం మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, గ్రామస్తులు సోముశేఖర రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

రైతుల ఆందోళనా పథం

- విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల కోసం రాస్తారోకో



హిందూపురం-మడకశిర రహదారి పై రాస్తారోకో చేస్తున్న రైతులు

మడకశిర: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టి నెలలు గడుస్తున్నా సరఫరా చేయని విద్యుత్ అధికారుల తీరుకు నిరసనగా రైతులు ఆందోళనకు దిగారు. సోమవారం పట్టణంలోని వజ్రపాళ్యం వద్ద గల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అమరాపురం, గుడిబండ మండలాలకు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. మడకశిర–హిందూపురం ప్రధాన రహదారి పై ట్రాక్టర్లను అడ్డంపెట్టి రాస్తారోకో చేశారు. దాదాపు గంట సేపు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో హిందూపురం–మడకశిర వైపుకు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ... ట్రాన్స్‌ఫార్మర్ల కోసం నెలలుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. మూడు రోజుల క్రితం సోమవారం ట్రాన్స్ ఫార్మర్ల ఇస్తామని అధికారులు చెప్పడంతో డబ్బులు ఖర్చు పెట్టుకుని ట్రాక్టర్లు తీసుకొని సబ్ స్టేషన్ వద్దకు రాగా, మళ్లీ ఇస్తామంటూ అధికారులు ముఖం చాటేశారన్నారు. సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నా.... ఇవ్వకుండా రైతుల జాబితా సిద్ధం కాలేదని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల స్థాయి విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతుల నుంచి రూ.వేలకు వేలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళన గురించి తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన విరమించాలని కోరగా, రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చివరకు పోలీసులు నచ్చచెప్పడంతో రైతులకు ఆందోళన విరమింప జేశారు.

క్లుప్తంగా

ప్రకృతి సిద్ధంగా మాగబెట్టాలి



పండ్ల వ్యాపారులతో మాట్లాడుతున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: అరటి, మామిడి కాయలను ప్రకృతి సిద్ధంగా మాగబెట్టాలని పండ్ల వ్యాపారులకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర సూచించారు. జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, మార్కెటింగ్ ఏడీ నరసింహమూర్తితో కలసి సోమవారం కొత్తచెరువు మార్కెట్ యార్డులోని పండ్ల వ్యాపారులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కాల్షియం కార్బైడ్ వాడకంతో కలిగే అనర్థాలను వివరించారు. మామిడి, అరటిని సహజ సిద్ధంగా మగ్గబెడితే మంచి గిట్టుబాటు ధర లభ్యమవుతుందని, అంతేకాకుండా పండ్లు కూడా పాడవకుండా ఉంటాయన్నారు.

1న చెస్ పోటీలు

ధర్మవరం అర్బన్: వచ్చే నెల 3, 4 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-9 చెస్ పోటీల్లో ప్రాతినిథ్యం వహించే జిల్లా క్రీడాకారుల ఎంపిక కోసం మే 1న పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి నాగార్జున సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ధర్మవరంలోని కళాజ్యోతిలో ఓపెన్ అండర్-9 కేటగిరిలో ఇద్దరేసి చొప్పున బాలబాలికలను ఎంపిక చేయనున్నారు. ఆసక్తి ఉన్న చెస్ క్రీడాకారులు గురువారం ఉదయం 11గంటలకు పోటీలకు హాజరుకావాలి. పూర్తి వివరాలకు 99858 96901, 91770 32075లో సంప్రదించవచ్చు.

'పురం'లో పెనుగాలుల బీభత్సం

హిందూపురం టౌన్: పట్టణంలో సోమవారం సాయంత్రం పెనుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గంటన్నర పాటు వర్షంతో పాటు విపరీతమైన గాలులు వీచడంతో ఆర్‌పీజీటీ రోడ్డు, రైల్వే రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, హోండా షోరూం ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆ సమయంలో హోండా షోరూం వద్ద ఉన్న ఆటోతో పాటు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. వాహనదారులకు ప్రాణాపాయం తప్పింది. మేళాపురం సమీపంలో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మేళాపురం వద్ద కాలువ పొంగి రోడ్డుపై మోకాళ్ల లోతు నీరు పారింది. రైల్వే రోడ్డులో ఎక్కడికక్కడ నీరు నిలిచి పరిస్థితి దారుణంగా మారింది.

భద్రత లేని ప్రయాణం

- 'ఎన్‌హెచ్ 544ఈ'లో ప్రమాదకరంగా మలుపులు
- ఎన్‌హెచ్ 44లోనూ ఇదే పరిస్థితి

హిందూపురం అర్బన్: వాహనం ఎక్కిన వారు తిరిగి ఇంటికి సురక్షితంగా చేరుకుంటారనుకునే పరిస్థితులు పోయాయి. సరైన భద్రతా ప్రమాణాలు, రహదారులపై సిగ్నలింగ్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో తరచూ ప్రమాదాలో చోటు చేసుకుని పలువురు మృత్యువాత పడుతున్నారు. మరికొందరు వైకల్యం బారిన పడుతున్నారు. ఈ పరిస్థితి 544ఈ జాతీయ రహదారితో పాటు 44వ జాతీయ రహదారిపై మరీ దారుణంగా మారింది. జాతీయ రహదారుల్లో మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాల సంఖ్య ఏటా పెరుగుతూ ఉంది. మూడేళ్ల క్రితం నూతనంగా నిర్మించిన ఎన్‌హెచ్ 544ఈపై చిలమత్తూరు, టేకులోడు మలుపుల వద్ద ఏర్పాటు చేసిన సోలార్ లైటింగ్ వ్యవస్థ పని చేయడం లేదు. లేపాక్షి లోకి వెళ్లే చోట పిల్లగుండ్లు, నవోదయ సమీపంలో మలపుల వద్ద సరైన భద్రతా ప్రమాణాలు లేవు. డివైడర్లను క్రమ పద్ధతిలో ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొల్లకుంట వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ప్రమాదాల నివారణకు ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడం గమనార్హం.

మచ్చుకు కొన్ని..

- హిందూపురం నుంచి గోరంట్ల, కదిరి వెళ్లే వాహనదారులు పాలసముద్రం క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిని దాటాల్సి ఉంది. ఈ ప్రాంతంలో అతివేగంగా వాహనాలు వెళుతుంటాయి. అండర్‌బ్రిడ్జి లేకపోవడంతో అటు వైపు నుంచి వస్తున్న వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇదే పరిస్థితి కొడికొండ చెక్‌పోస్టు వద్ద నెలకొంది.



జాతీయ రహదారి నుంచి లేపాక్షిలోకి వెళ్లే చోట ప్రమాద హెచ్చరిక బోర్డులు లేని దృశ్యం

- హిందూపురం-కదిరి రహదారి మరమ్మతుల కారణంగా రోజూ ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటూనే ఉంది. రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రహదారుల మలుపులు వద్ద, ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో సైన్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడమే ఇందుకు కారణంగా పలువురు ఆరోపిస్తున్నారు.
- చిలమత్తూరు సమీపంలోని చేనేపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారి క్రాస్ చేయాలి. అక్కడ నిత్యం ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. ఈ మూడేళ్లలో ఐదుగురు అక్కడ మృత్యువాతపడగా, 12 మంది క్షతగాత్రులయ్యారు.
- చిలమత్తూరు మీదుగా టేకులోడు క్రాస్‌కు వెళ్లే రహదారిలో బైరేకుంట వద్ద మలుపు ఉంది. రహదారి ఓ వైపు దింపుగా ఉండడంతో అటుగా వెళ్లే వాహనాలు, వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. 20 రోజుల క్రితం ఇదే మలుపు వద్ద ఓ మహిళ బస్సు నుంచి జారి పడి మృతి చెందింది.
- జాతీయ రహదారి 544ఈ లో చిలమత్తూరు, టేకులోడు మలుపుల వద్ద చిలమత్తూరు రోడ్డుకు కలిపే రోడ్డు వద్ద సరైన జాగ్రత్తలు చేపట్టలేదు. ఏడాది క్రితం కారు ఢీ కొనడంతో చామలపల్లికి చెందిన ఇద్దరు మృత్యువాత పడ్డారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అక్కడి రోడ్డు డివైడర్లు రాత్రి సమయంలో అస్సలు కనిపించవు. ఇక సోలార్ లైట్లు అలంకార ప్రాయమయ్యాయి.
- 44వ జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్టు, కోడూరు, పాలసముద్రం క్రాస్‌ల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల నివారణకు ఇప్పటికే పలు సర్వేలు చేసినా.. ఆచరణలో అమలుకు నోచుకోలేదు. మూడేళ్లలో ఆరుగురు చనిపోగా.. 8 మంది గాయపడ్డారు. కోడూరు వద్ద ప్రమాదాలు జరిగినప్పుడు సమీప గ్రామాల వారు ధర్నాలు చేస్తే ఆ సమయంలో స్పందించే అధికారులు... తర్వాత ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు.
- జాతీయ రహదారులపై ఆటోల నిషేధం ఉన్నా.. తప్పని పరిస్థితుల్లో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు తరచూ ఆటోలను ఆశ్రయించడం తప్పడం లేదు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తరలిస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

చర్యలు తీసుకుంటాం

జాతీయ, రాష్ట్ర రహదారుల్లో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ఆర్అండ్‌బీ అధికారులు, పోలీసులను సమన్వయం చేసుకుని గుర్తిస్తాం. ఈ క్రమంలోనే ప్రమాదాలపై ప్రజలు అందజేసిన అర్జీలనూ పరిగణనలోకి తీసుకుని కలెక్టర్, ఎన్‌హెచ్ అథారిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రమాదాల నివారణపై చర్యలు తీసుకుంటాం.

– కరుణసాగర్‌రెడ్డి, జిల్లా రవాణాధికారి

బాలికను కాపాడిన పోలీసులు

హిందూపురం: మైనర్ బాలికను సురక్షితంగా కాపాడి తల్లిదండ్రుల చెంతకు పోలీసులు చేర్చారు. వివరాలు...హిందూపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల వయసున్న బాలికను పరిగి మండలం బీచగానిపల్లికి చెందిన ఓ యువకుడు సోమవారం తనతో పాటు పిలుచుకెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న బాలికల తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు తెలిపారు. స్పందించిన డీఎస్పీ మహేష్ ఆదేశాలతో రూరల్ సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ మునిప్రసాద్, సిబ్బంది బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో సోమందేపల్లి మండలం వెలగమాకులపల్లి తండా గుట్టల్లో ఉన్నట్లుగా గుర్తించి, ఎస్‌ఐ మునిప్రతాప్, ఏఎస్‌ఐ జయరామిరెడ్డి, సోమందేపల్లి ఎస్‌ఐ రమేష్ అక్కడకు వెళ్లి రాత్రి 7 గంటల సమయంలో యువకుడితో పాటు మైనర్ బాలికను హిందూపురం రూరల్ పీఎస్‌కు పిలుచుకువచ్చారు. కౌన్సెలింగ్ అనంతరం బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

యువకుడి దుర్మరణం



ప్రదీప్ (ఫైల్)

పావగడ: రోడ్డు పక్కన నిలబడిన లారీని వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహన చోదకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పావగడ తాలూకా క్యాతగానచెర్లు గ్రామానికి చెందిన కురుబ సుబ్బిరెడ్డి, లక్ష్మీదేవి దంపతుల నాల్గవ కుమారుడు ప్రదీప్(23) తుమకూరులోని ఓ ద్విచక్రవాహనాల షోరూంలో మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని చేదోడుగా నిలిచాడు. ఆదివారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై శిరా గేట్ ప్రాంతానికి బయలుదేరిన ఆయన.. జోరుగా వర్షం కురుస్తుండడంతో రోడ్డు సరిగా కనపడక ఎదురుగా నిలబడిన లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బీటెక్ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి

అనంతపురం: జేఎన్‌టీయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి సోమవారం విడుదల చేశారు. పరీక్షలు జరిగిన 15 రోజుల్లోనే ఫలితాల విడుదలకు కృషి చేసిన డిప్యూటీ కంట్రోలర్స్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కే. మాధవి, డాక్టర్ డి .లలిత కుమారి కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం పాలకమండలి సభ్యుడు ఎం.రామశేఖర్‌రెడ్డి, విభాగాధిపతులు టి.నారాయణరెడ్డి, జి.మమత, కళ్యాణ్‌కుమార్, అజిత, జరీనా పాల్గొన్నారు.

పునర్‌వ్యవస్థీకరణలో అసంబద్ధాలు తొలగించండి

కదిరి అర్బన్: పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో అసంబద్ధాలను తొలగించాలని కూటమి ప్రభుత్వాన్ని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కదిరికి విచ్చేసిన డీఈఓ కృష్ణప్పకు ఫ్యాప్టో చైర్మన్ హరిప్రసాద్, కో చైర్మన్ షామిల్లా వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగా పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల తీర్మానాలతో పాఠశాల పునర్ నిర్మాణ ప్రక్రియ చేపట్టాలన్నారు. చాలా ప్రాంతాల్లో పాఠశాల కమిటీ తీర్మానాలను పరిగణనలోకి తీసుకోకుండా పునర్‌నిర్మాణ ప్రక్రియ చేపడుతుండడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉర్దూ సెక్షన్ ఉన్న తెలుగు మీడియం పాఠశాలల్లో ఉర్దూ పోస్టులను రద్దు చేయడం జరిగిందన్నారు.



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఉన్నఫలంగా ఉర్దూ సెక్షన్, ఉర్దూ పోస్టులను రద్దు చేయడంతో ఉర్దూ మాధ్యమం చదివే పిల్లల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో అతావుల్లా, అష్రఫ్, వాజిద్, సొహెల్, గౌస్ అహమ్మద్, తదితరులు ఉన్నారు.

డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు నూతన చైర్మన్ల నియామకం

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ వివిధ కార్పొరేషన్‌లకు చైర్మన్‌లను నియమిస్తూ కూటమి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా గార్లదిన్నె మండలానికి చెందిన టీడీపీ నాయకుడు ముంటిమడుగు కేశవరెడ్డి నియమించారు. అలాగే జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా కనగానపల్లి మండలానికి చెందిన టీడీపీ నాయకుడు నెట్టెం వెంకటేసును నియమించారు.



ముంటిమడుగు కేశవరెడ్డి



నెట్టెం వెంకటేసు

టీడీపీ నేతలు దౌర్జన్యం చేస్తున్నారు

- న్యాయం చేయాలని ఎస్పీని వేడుకున్న బాధితులు
- 'పోలీసు స్పందన'కు 65 వినతులు

పుట్టపర్తి టౌన్: తమ సొంత స్థలంలో ఇల్లు కట్టుకుంటుంటే టీడీపీ నేతలు అడ్డుకుని దౌర్జన్యం చేస్తున్నారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో డీఎస్పీ విజయ్‌కుమార్‌ను కలసి వినతి పత్రం అందజేసి, తమ గోడు వెల్లబోసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పుట్టపర్తి మండలం బుగ్గపల్లి గ్రామానికి చెందిన నిడిమామిడప్పకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు మూగవాడు, రెండో కుమారుడు జీవనాధారం కోసం అనంతపురానికి వలస వెళ్లాడు. నిడిమామిడప్పకు అదే గ్రామంలో 2007లో సర్వే నంబర్ 349లో అప్పటి ప్రభుత్వం రెండు సెంట్ల స్థలాన్ని మంజూరు చేస్తూ పట్టా ఇచ్చింది. 2023లో ఆర్డీటీ సౌజన్యంతో పునాది ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఇంటి పట్టా చెల్లదంటూ అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నలుగురు దౌర్జన్యానికి దిగారు. పోరంబోకు భూమిలో పునాదులు వేశారంటూ పెకలించి వేశారు. ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే నిడిమామిడప్పకు అనుకూలంగా తీర్పు వెలువడింది. అయినా టీడీపీ నేతలు దౌర్జన్యం చేస్తూనే ఉన్నారు. ఈ విషయంగా తమకు న్యాయం చేయాలంటూ గతంలో కలెక్టర్, ఎస్పీకు ఫిర్యాదు చేసినా న్యాయం చేకూరలేదని బాధితులు వివరించారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నామని పేర్కొన్నారు. సమస్యపై స్పందించిన డీఎస్పీ విజయ్‌కుమార్ వెంటనే సంబంధిత సీఐకి ఫోన్ చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.



డీపీఓ ఎదుట మీడియాతో మాట్లాడుతున్న నిడిమామిడప్ప కుటుంబసభ్యులు

- జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 65 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్ట పరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మె



సమ్మెలో పాల్గొన్న సీహెచ్‌ఓలు, ఎన్‌జీఓ నాయకులు

పుట్టపర్తి అర్బన్: తమ డిమాండు నెరవేర్చే వరకూ సమ్మెలో కొనసాగుతామని వైద్య, ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ కింద పనిచేస్తున్న సీహెచ్‌ఓలు స్పష్టం చేశారు. సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ఉదయం నుంచి సాయంత్రం వరకూ బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్‌జీఓ సంఘం నాయకులు మాట్లాడుతూ... గత రెండేళ్లుగా జీతభత్యాల విషయంతో తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సమస్యలను పరిష్కరించే వరకూ నిరవధిక సమ్మెలోకి వెళుతున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజబేగంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎంసీఏ జిల్లా అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ నందీశ్వరరెడ్డి, చందన, వేణుగోపాల్, ఏపీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రామమోహన్, నాయకులు శంకర్, జగదీష్, బాబాఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచండి : డీఐఈఓ

పెనుకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి మెరుగైన ఫలితాలు రాబట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధ్యాపకులకు డీఐఈఓ సయ్యద్ మౌలా సూచించారు. పెనుకొండలోని కళాశాలలో నిర్వహిస్తున్న ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను సోమవారం పరిశీలించారు. ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, బొటనీ సబ్జెక్టులకు బోధనా విధానాలపై ఆన్‌లైన్‌లో అందిస్తున్న శిక్షణను పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో అధికంగా చేరడానికి తగిన దృష్టి సారించాలన్నారు. అనంతరం ఆయనను ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు సన్మానించారు.

హౌస్ వైరింగ్‌పై 'రూడ్‌సెట్'లో ఉచిత శిక్షణ

అనంతపురం: ఎస్కేయూ సమీపంలోని రూడ్‌సెట్ సంస్థలో మే 6 నుంచి జూన్ 4వ తేదీ వరకూ ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌పై యువకులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 18 నుంచి 45 సంవత్సరాల్లోపు వయస్సు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు అర్హులు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి ఉంటుంది. పూర్తి వివరాలకు 94925 83434లో సంప్రదించవచ్చు.

అర్జీలు పరిష్కరించకపోతే చర్యలు

- కొన్ని శాఖల్లో పెండింగ్ అర్జీలు ఎక్కువగా ఉన్నాయి
- పనితీరు మార్చుకోకపోతే కఠినంగా వ్యవహరిస్తాం
- అధికారులను హెచ్చరించిన కలెక్టర్ టీఎస్ చేతన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: ''ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందే ప్రతి అర్జీకి నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ కొన్ని శాఖల అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నెలల తరబడి అర్జీలను పెండింగ్ ఉంచారు. ముఖ్యంగా రెవెన్యూ, సర్వే, పోలీస్ పంచాయతీ రాజ్, ఏపీఎస్పీడీసీఎల్ శాఖల పరిధిలో అత్యధిక గ్రీవెన్స్ అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇకనైనా అధికారులు పద్ధతి మార్చుకుని అర్జీలకు పరిష్కారం చూపాలి. లేకపోతే కఠిన చర్యలు తప్పవు'' అని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 231 అర్జీలు అందగా, వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపారు. అనంతరం కలెక్టర్ చేతన్ అధికారులతో సమావేశమయ్యారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు నెలవారీ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకుని నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంపై డీఆర్‌ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆర్డీఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం జిల్లా ప్రణాళిక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జిల్లాలోని అన్ని శాఖల హెచ్‌ఓడీలతో వివిధ శాఖలకు సంబంధించిన నెలసరీ ప్రగతి నివేదికలపైన, పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తారన్నారు.

- అనంతరం ఆయన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పరిశీలించారు. ప్రతి సోమవారం చిరుధాన్యాలకు సంబంధించిన స్టాల్స్‌ను నిర్వహించాలని సూచించారు.

దివ్యాంగుడికి హామీ..

ఓడీ చెరువు మండలానికి చెందిన దివ్యాంగుడు శంకర సమస్యను కలెక్టర్ విన్నారు. 63 సెంట్లు భూమికి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరగా, త్వరలోనే జాయింట్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, సెరికల్చర్ జేడీ పద్మావతి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, సీపీఓ విజయ్ కుమార్, ల్యాండ్ సర్వే ఏడీఈ విజయశాంతి బాయి, ఎల్‌డీఎం రమణ కుమార్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, గిరిజన సంక్షేమ అధికారి మోహన్‌రావు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫిరోజ్ బేగం, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



వికలాంగుడు శంకరయ్య సమస్యను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

కౌమార బాలికల సాధికారతకు కృషి చేయాలి..

కౌమార బాలికల సాధికారత కోసం కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పీజీఆర్‌ఎస్ సమావేశం అనంతరం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'కిశోర వికాసం' వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కిశోర వికాసం పేరుతో ప్రతి గ్రామం, వార్డులో కిశోర బాలికలకు ప్రతి మంగళవారం, శుక్రవారం 12 అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. మే 2వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకూ సమ్మర్ క్యాంప్ నిర్వహించాలన్నారు.

సోలార్ నిర్మాణ పనులు అడ్డుకున్న రైతులు

ఎన్పీకుంట: పరిహారం చెల్లించేవరకూ తమ భూముల్లో సోలార్ ప్రాజెక్ట్ పనులు చేపట్టరాదంటూ సోమవారం నిర్వాసిత రైతులు ఆందోళన చేపట్టారు. ఎన్పీకుంట మండలం పెడబల్లి పంచాయతీలో ఎన్‌హెచ్‌పీసీ, ఇలియోస్ పవర్ కంపెనీ వారు చేపట్టిన నూతన సోలార్ పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భూములు కోల్పోయిన పలువురు రైతులకు ఇప్పటి వరకూ పరిహారం అందలేదు. దీంతో తమకు పరిహారం చెల్లించిన తరువాతనే పనులు చేపట్టాలని బాధిత రైతులు నిర్మాణ పనులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సోలార్ నిర్మాణం కోసం భూ సేకరణ చేసే సమయంలో ఎకరాకు రూ.5లక్షలు పరిహారం చెల్లిస్తామని తెలిపారన్నారు. ఇందులో కొందరు రైతులకు భూమికి బదులు భూమి ఇస్తామని, అలాగే ఉలవ పంట సాగు చేసిన రైతులకు పంట నష్ట పరిహారం కూడా ఇస్తామని చెప్పి ఇప్పటి వరకూ ఒక్క రూపాయి చెల్లించకుండా మోసం చేశారని వాపోయారు. సోలార్ ప్రాజెక్టు వలన ఇక్కడి రైతులకు, నిరుద్యోగ యువతకు ఎలాంటి ప్రయోజనం లేదని ధ్వజమెత్తారు. తమ భూములకు పరిహారం చెల్లించిన తరువాతనే పనులు చేపట్టాలని, అలాకాకుండా దౌర్జన్యంగా పనులు చేపడితే ఎంతవరకైనా పోరాటానికి తాము సిద్ధమని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న రైతులు

మద్యం షాపుల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం: జిల్లాలో ఖాళీగా ఉన్న మద్యం షాపుల నిర్వహణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి. నాగమద్దయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మడకశిర నగర పంచాయతీ పరిధిలో రెండు, గుడిబండ మండలంలో ఒకటి, అమరాపురం మండలంలో ఒకటి చొప్పున ఖాళీగా ఉన్న మద్యం షాపుల నిర్వహణకు ఆసక్తి ఉన్న వారు జిల్లా పరిధిలోని 8 ఎక్సైజ్ స్టేషన్లలో ఎక్కడైనా దరఖాస్తులు అందజేయవచ్చు. రూ.2 లక్షల నాన్ రీఫండబుల్ దరఖాస్తు రుసుమును డీడీ ద్వారా చెల్లించాలి. అప్లికేషన్‌కు ఆధార్ కార్డు జత చేసి మే 3వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలి.